31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

బుధవారం,నవంబర్ 04 , 2026

పేజీలు : 8

ఏఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు...

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 3 : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (సివిల్స్) పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 6, 7 తేదీల్లో జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నాచుపల్లి, కొండగట్టు, కొడిమ్యాల మండలంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉదయం 10 నుండి 12.30 గంటల



వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, సైబర్ పోలీసులతో సోషల్ మీడియా పర్యవేక్షణ, నిరంతర విద్యుత్, ప్రథమ చికిత్స, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్ సూచనలు పాటిస్తూ గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని కోరారు.



నిర్వహణలోనేనా భక్తి ?

- నిమజ్జనంలో ఎందుకు కనిపించడం లేదు
- పది రోజుల పూజలు..చివరి రోజున నిర్లక్ష్యమా?
- వినాయకుడు, బతుకమ్మ, అమ్మవారి నిమజ్జనాల్లో కొరవడిన భక్తిభావం
- నీళ్లు లేని చెరువులు,కుంటల్లోనే నిమజ్జనాలు
- ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది
- ఆడంబరాలకు వేలాది రూపాయలు
- నీళ్లు లేకుండా ఎస్సారెస్పీ కెనాల్ గట్లపైన వదిలేసిన ప్రతిమలు

నిర్వహణలో నేనా భక్తి..?

చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (03) : పండుగ వచ్చిందంటే చాలు.. గ్రామాల్లో సందడి మొదలవుతుంది. వీధివీధినా మండపాలు, భారీ విగ్రహాలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, మైకులు, డీజేలు, ఊరేగింపులు.. ఇలా పది రోజుల పాటు పండుగ వాతావరణం అంబరాన్నంటుతుంది. వినాయక చవితి నుంచి బతుకమ్మ, దసరా నవరాత్రుల వరకు భక్తి పేరుతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల నిర్వహణలో ఒకరిని మించి మరొకరు పోటీపడుతుంటారు. కానీ ఇంతటి వైభవంగా నిర్వహించిన ఉత్సవాలకు చివరి ఘట్టమైన నిమజ్జనం వచ్చేసరికి మాత్రం ఆ భక్తి, బాధ్యత, శ్రద్ధ ఎక్కడికి వెళు

_న్నాయన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. భక్తితో పూజించిన దేవతామూర్తులను గౌరవప్రదంగా సాగనంపాల్సిన సమయంలో నిర్లక్ష్యం ఎందుకు కనిపిస్తోంది? నిర్వహణలో చూపిన ఉత్సాహం నిమజ్జనంలో ఎందుకు కనిపించడం లేదు?

పండుగల నిర్వహణలో పోటీ.. నిమజ్జనంలో నిర్లక్ష్యం..

వినాయక చవితి సందర్భంగా భారీ విగ్రహాల ఏర్పాటు, మండపాల అలంకరణ, ప్రత్యేక -మిగతా 2లో

రెండు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్


చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 3 : ఎల్నినో ప్రభావంతో కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, కరువు పరిస్థితుల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈ నేపథ్యంలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించాలని కోరుతూ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి లేఖ రాశారు. ఎల్ నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆయా మండలాల్లో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడిందని, రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు సైతం ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఇప్పటికే రెండు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించారని, మిగిలిన ఐదు మండలాల్లోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఈ రెండు మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు.తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఆయా మండలాలు, గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు-మిగతా 2లో

రైతన్నలు కరువు పట్ల ఆలోచన చేయాలి

- సూపర్ ఎల్నినో ద్వారా కరువు..
- ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మవద్దు..
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోంది..
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్ నవంబర్ 3 : పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతుని పేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకు రాయి గ్రామాల్లో, పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో, చందపల్లిలో ఐకేపీ సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ను స్థానిక నాయకులతో కలిసి ప్రారం భించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సూపర్ ఎల్నినో కార ణంగా భూగర్భ-మిగతా 2లో

అనారోగ్యంతో బాధపడుతున్న కౌన్సిలర్‌ను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



చురకలు ప్రతినిధి కోరుట్ల నవంబర్ 03 : కోరుట్ల పట్టణ మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ చిట్యాల లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం 21వ వార్డుకు చెందిన బాలుడు కుక్కకాటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆసుపత్రిని సందర్శించి బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కౌన్సిలర్ రిజ్వాన్, మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు మరిపెల్లి జనార్దన్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న లారీ నుంచి రోడ్డుపై పడిపోయిన భారీ చైన్ జేసీబీ

-తృటిలో తప్పిన పెను ప్రమాదం

-ఊపిరి పీల్చుకున్న స్థానికులు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 03 : ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ వద్ద భారీ ప్రమాదం తృటిలో తప్పింది. లారీలో తరలిస్తున్న భారీ చైన్ జేసీబీ ఒక్కసారిగా కదులుతున్న లారీ నుంచి జారి రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ సమీపంలో లారీలో భారీ చైన్ జేసీబీని తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జేసీబీ రోడ్డుపై పడిపోయిన సమయంలో సమీపంలో వాహనాలు, పాదచారులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.అదే సమయంలో అటుగా వాహనాలు వెళ్తున్నా, పాదచారులు రోడ్డు పక్కన ఉన్నా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. భారీ యంత్రాలను లారీలపై తరలించే సమయంలో తగిన భద్రతా చర్యలు, పటిష్టమైన బిగింపులు తప్పనిసరిగా పాటించాలని పలువురు అభిప్రాయపడ్డారు.రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



నిర్వహణ లోనేనా భక్తి

మొదటి పేజీ తరువాయి.... పూజలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. బతుకమ్మ పండుగలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటున్నారు. దసరా నవరాత్రుల్లో అమ్మవారికి రోజుకో అలంకరణ, ప్రత్యేక పూజలు, భజనలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. అయితే పండుగల నిర్వహణలో కనిపిస్తున్న ఆడంబరం, భక్తి నిమజ్జనం సమయంలోనూ కనిపించాల్సిన అవసరం ఉంది. పూజించిన దేవతామూర్తులను చివరి ఘట్టంలో గౌరవంగా సాగనంపడం కూడా ఉత్సవంలో అంతర్భాగమేనన్న విషయాన్ని మరచిపోకూడదు.

నీరు లేని చెరువులు.. ఎక్కడికక్కడ నిమజ్జనాలు..

ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, కొన్ని చోట్ల పూర్తిగా ఎండిపోవడంతో నిమజ్జనాలకు అనువైన పరిస్థితులు లేకుండా పోతున్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోకుండా నీరు లేని చెరువులు, కుంటలు, గుంతల్లోనే విగ్రహాలను వదిలేస్తున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. మరికొన్ని చోట్ల నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి రోజుల తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. పూలు, ప్లాస్టిక్ కవర్లు, అలంకరణ వస్తువులు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.ఒకవైపు ప్రకృతిని పూజిస్తున్నామని చెప్పుకుంటూనే మరోవైపు అదే ప్రకృతికి హాని కలిగించేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం? నీరు లేని ప్రాంతాల్లో విగ్రహాలను వదిలేయడం నిమజ్జన సంప్రదాయానికి గౌరవం తీసుకువస్తుందా? భక్తితో ప్రతిష్ఠించిన దేవతామూర్తులను నిర్లక్ష్యంగా వదిలేయడం మన సంస్కృతికి తగినదేనా ? ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

ఆడంబరాలే భక్తికి కొలమానమా..?

నేటి రోజుల్లో పండుగల నిర్వహణలో ఆడంబరాలకు అధిక ప్రాధాన్యత పెరుగుతోంది. భారీ విగ్రహాలు, ఖరీదైన అలంకరణలు, డీజేలు, భారీ ఊరేగింపులే ఉత్సవాల ప్రత్యేకతగా భావించే పరిస్థితి ఏర్పడుతోంది. ఉత్సవాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఫొటోలు, వీడియోలు, ప్రచారాలతో హడావుడి చేస్తున్న కొందరు నిర్వాహకులు నిమజ్జనం విషయంలో మాత్రం కనీస ఏర్పాట్లు చేయకపోవడం విచారకరం.వేలాది రూపాయలు ఖర్చు చేసి మండపాలు ఏర్పాటు చేయగలిగినప్పుడు, నిమజ్జనం కోసం ఒక ప్రత్యేక తొట్టి ఏర్పాటు చేయలేమా? విగ్రహాల కొనుగోలు, అలంకరణలకు బడ్జెట్ కేటాయిస్తున్నప్పుడు పర్యావరణ పరిరక్షణకు కొంత మొత్తం కేటాయించలేమా? ఉత్సవాల విజయాన్ని కేవలం జనసందోహం, భారీ విగ్రహాలు, ఆర్భాటాలతో కాకుండా వాటిని ఎంత బాధ్యతగా నిర్వహించి ముగించామన్న దానితో కూడా అంచనా వేయాలి.

భక్తి అంటే ప్రకృతిని బాధించడం కాదు.. ప్రకృతిని కాపాడటం..

మన సంప్రదాయాల్లో ప్రకృతికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. చెట్లు, పుట్టలు, నదులు, చెరువులు, పర్వతాలను దైవస్వరూపాలుగా భావించి పూజించే సంస్కృతి మనది. బతుకమ్మలో ప్రకృతికి సంబంధించిన పూలను పూజిస్తాం. వినాయకుడిని విఘ్నాలు తొలగించే దైవంగా ఆరాధిస్తాం. అమ్మవారిని జగన్మాతగా కొలుస్తాం. అలాంటి దేవతామూర్తుల ఉత్సవాల పేరుతో నీటి వనరులు కలుషితమైతే, పరిసరాలు అపరిశుభ్రంగా మారితే మనం ఇచ్చే సందేశం ఏమిటి ప్రకృతిని కాపాడుకోవడం కూడా దైవారాధనలో భాగమేనని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగుల వినియోగాన్ని తగ్గించి, సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి. పూజా సామగ్రిని నీటిలో పడేయకుండా ప్రత్యేకంగా సేకరించాలి. నీటి వనరుల పరిశుభ్రతను కాపాడాలి.

అధికారుల బాధ్యత కూడా అంతే ముఖ్యం..

ఉత్సవాలు ముగిసిన తర్వాత నిమజ్జన ఏర్పాట్ల కోసం హడావుడి చేయడం కంటే ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవడం అవసరం. గ్రామపంచాయతీలు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, సంబంధిత శాఖలు ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకోవాలి. ప్రతి గ్రామంలో నిమజ్జనానికి అనువైన ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి. నీరు లేని చెరువులు, కుంటల్లో విగ్రహాల నిమజ్జనాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలి. నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో కృత్రిమ నిమజ్జన తొట్టెలను ఏర్పాటు చేయాలి.నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రిని తొలగించే బాధ్యతను కూడా సంబంధిత అధికారులు తీసుకోవాలి. కేవలం సూచనలు చేయడం కాకుండా వాటి అమలుపై పర్యవేక్షణ ఉండాలి. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయాలి.

యువతలో మార్పు వస్తే.. పండుగల రూపురేఖలే మారుతాయి..

ప్రస్తుతం పండుగల నిర్వహణలో యువత కీలక పాత్ర పోషిస్తోంది. మండపాల ఏర్పాటు నుంచి ఊరేగింపుల వరకు యువజన సంఘాలే ముందుంటున్నాయి. అదే యువత నిమజ్జన ఏర్పాట్లలోనూ బాధ్యత తీసుకుంటే ఎంతో మార్పు సాధ్యమవుతుంది. ప్రతి ఉత్సవ కమిటీ నిమజ్జనానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. నీటి వనరులు, పర్యావరణం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భక్తులకు అవగాహన కల్పించాలి. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచేలా పర్యావరణహిత నిమజ్జనాలను నిర్వహించాలి.పిల్లలకు కూడా పండుగల అసలు ఉద్దేశాన్ని తెలియజేయాలి. పండుగ అంటే కేవలం వినోదం, ఆడంబరం కాదని.. ఐక్యత, సంప్రదాయం, ప్రకృతి పరిరక్షణ, సామాజిక బాధ్యతల సమాహారమని అర్థమయ్యేలా చేయాలి.

మార్పు మన నుంచే ప్రారంభం కావాలి..

ఒకప్పుడు పండుగలు సామూహిక ఐక్యతకు, భక్తికి, సంప్రదాయ పరిరక్షణకు వేదికలుగా ఉండేవి. ఇప్పుడు ఆ పండుగల అసలు స్ఫూర్తి మరుగున పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఉత్సవాల ప్రారంభంలో ఎంత భక్తి చూపుతామో, ముగింపు సమయంలోనూ అంతే భక్తి, శ్రద్ధ, బాధ్యత చూపించాలి. నీరు లేని చెరువుల్లో విగ్రహాలను వదిలేయడం, పూజా సామగ్రిని ఎక్కడపడితే అక్కడ పడేయడం వంటి పద్ధతులకు స్వస్తి పలకాలి.ప్రతి గ్రామంలో ఒక ఆదర్శ నిమజ్జన విధానం అమలైతే, రాబోయే తరాలకు మంచి సంప్రదాయాన్ని అందించినవారమవుతాం. పండుగల నిర్వహణలో పోటీ పడటం కంటే పర్యావరణహిత నిమజ్జనంలో పోటీ పడే రోజులు రావాలి. భారీ విగ్రహాల కంటే భక్తి భావం గొప్పదని, ఆడంబరాల కంటే ఆచరణ ముఖ్యమని నిరూపించాలి.

రైతన్నలు కరువు పట్ల ఆలోచన చేయాలి

మొదటి పేజీ తరువాయి...జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. కరువు పట్ల రైతన్నలు ఆలోచన చేయలని యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దలారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు మండలంలో ఐకేపీ మరియు సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు తన పంట అమ్మిన రెండు రోజుల్లోనే తన ఖాతాలో డబ్బులు జమ అవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉందని ధాన్యం కొనుగోళ్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు మరియు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు,రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి

మొదటి పేజీ తరువాయి.... చేస్తున్నారని తెలిపారు.ప్రజలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ జిల్లా పరిధిలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను కరువు మండలాలుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

జిల్లాలోని బియ్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



చురకలు ప్రతినిధి,జగిత్యాల,నవంబర్ 3 : జిల్లా పౌరసరఫరాల అధికారి ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాల పట్టణ పరిధిలోని పలు హోల్ సేల్, రిటైల్ బియ్యం దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించకుండా, అధిక ధరలకు విక్రయించకుండా చూడటమే లక్ష్యంగా తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్లు దుకాణాలు, గోదాముల నిల్వలను లెక్కించారు. ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ప్రకారం బీపీటీ, కెఎన్ఎం మిల్లు వద్ద రూ.62, హోల్ సేల్ రూ.64, రిటైల్ రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోన మిల్లు రూ.70, హోల్ సేల్ రూ.72, రిటైల్ రూ.74,హెచ్ఎంటీ, జై శ్రీరామ్, మిల్లు రూ.75, హోల్ సేల్ రూ.77, రిటైల్ రూ.79లకు విక్రాయించాలని సూచించారు. ప్రతి షాపు ఎదుట నిల్వ వివరాలు,ధరల బోర్డు ఏర్పాటు చేయాలని, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ పత్రాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. 26 కిలోల బస్తా పేరుతో 24, 25 కిలోలు విక్రయిస్తే మోసపూరిత కొలతల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు పాటించని వ్యాపారులపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక





చురకలు విలేకరి,బీర్ పూర్,నవంబర్ 3 : టీపీటీఎఫ్ బీర్పూర్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్పీహెచ్ఎస్ బీర్పూర్ పాఠశాల ఆవరణలో మండల అధ్యక్షుడు జి.మధుసూదన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశ్ నివేదిక సమర్పించారు.ఎన్నికల నిర్వాహకులు ఆర్.మహేష్, పరిశీలకులు కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా వి.గంగారాం, ప్రధాన కార్యదర్శిగా ఎం.విష్ణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా చీర్నేని రవి, డి.శ్రీదేవి, ఎం.మధుకర్, ఆర్.జనార్ధన్, కార్యదర్శులుగా జి.సాయిరాం, ఎ.పద్మ, ఎన్.స్వప్న,జి.సుమన్,బి.శారదలు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా కడారి ప్రకాశ్, గొడుగు మధుసూదన్, ఆర్మూర్ భీమరాజు, ఎడ్ల గోవర్ధన్, గొడుగు రఘుపతి యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

ఎట్టకేలకు పెంపుడు తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్నారి

-కోర్టు ఆదేశాలతో అప్పగింత



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 3 : పెంపుడుతల్లిదండ్రులకు దూరమైన బాలుడు ఎట్టకేలకు తిరిగి వారి చెంతకు చేరాడు. జగిత్యాలలో చోటు చేసుకున్న ఈ ఘటన లో పెంపుడు తల్లిదండ్రుల నుంచి బాలుడిని దూరం చేసి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉంచారు.తనకు అమ్మ కావాలంటూ బాలుడు రోదించిన దృశ్యాలు పలువురిని ఆందోళనకు గురిచేశాయి.ఈ నేపథ్యం లో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు స్పందించి,శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న బాలుడిని ఎట్టకేలకు పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుడు తిరిగి వారి చెంతకు చేరడంతో కుటుంబంలో ఆనందం నెలకొంది.

విదేశీ యుద్ధ ప్రాంతాల్లో చిక్కుకుంటున్న

భారతీయ యువతను కాపాడాలి

-షేక్ చాంద్ పాషా



చురకలు విలేఖరి,జగిత్యాల, నవంబర్, 03 : ప్రపంచ శాంతి సంస్థ అంబాసిడర్ సుధీర్ తారేను కలిసిన చాంద్ పాషా -- అంతర్జాతీయ స్థాయిలో జోక్యం చేసుకోవాలని, విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి పుణే, నవంబర్ 1, 2026: తెలంగాణ ఎన్ఆర్ఐ టీపీసీసీ కన్వీనర్ డాక్టర్ షేక్ చాంద్ పాషా, ప్రపంచ శాంతి సంస్థ అంబాసిడర్ శ్రీ సుధీర్ తారే గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి నవంబర్ 1న ఆయన నివాసానికి వెళ్లారు. సుధీర్ తారే గారి జన్మదినం అక్టోబర్ 28న జరిగింది.ఈ సందర్భంగా షేక్ చాంద్ పాషా మరియు సయ్యదా సమీనా పర్వీన్ కలిసి ఆయనకు జన్మదిన జ్ఞాపికగా ఫోటో ఫ్రేమ్‌ను బహూకరించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.జన్మదిన శుభాకాంక్షలతో పాటు, ఈ సమావేశంలో ఒక తీవ్రమైన జాతీయ సమస్యపై చర్చ జరిగింది. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ భారతీయ యువతను మోసపూరితంగా ఆకర్షించి,కొందరిని విదేశీ యుద్ధ ప్రాంతాల్లోకి నెట్టివేస్తున్నారనే ఆరోపణల పై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

నకిలీ ఉద్యోగాల పేరుతో విదేశాలకు ఆకర్షితులవుతున్న భారతీయ యువత

నిరుద్యోగ భారతీయ యువతను సెక్యూరిటీ గార్డులు తదితర ఉద్యోగాల పేరుతో విదేశాలకు ఆకర్షిస్తున్నారని డాక్టర్ చాంద్ పాషా ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, కొంతమంది యువకుల నుంచి ఉద్యోగాల పేరుతో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసి, సరైన ఉద్యోగం కల్పిస్తామని నమ్మబలికి విజిట్ వీసాలపై విదేశాలకు పంపుతున్నట్లు ఆరోపించారు.విదేశాలకు చేరుకున్న తర్వాత కొంతమంది యువకులను కంపెనీ క్యాంపులకు తీసుకెళ్లి, అక్కడ ఏకే-47 రైఫిళ్లకు సంబంధించిన శిక్షణతో సహా సైనిక శిక్షణ ఇస్తున్నారని, అనంతరం యుద్ధాలు జరుగుతున్న ప్రాంతాల్లో విధులకు పంపిస్తున్నారని ఆయన ఆరోపించారు.తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కలలతో విదేశాలకు వెళ్లే యువత, చివరకు స్వదేశానికి దూరంగా ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుని సరైన రక్షణ లేకుండా ఇబ్బందులు పడుతున్నారని చాంద్ పాషా హెచ్చరించారు.

2012లోనే ఈ సమస్యపై పోరాటం ప్రారంభించిన చాంద్ పాషా

ఈ చర్చ సందర్భంగా చాంద్ పాషా 2012లోనే ఈ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత భారత రాయబార కార్యాలయం, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలకు ఫిర్యాదులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.ఈ వ్యవహారానికి సంబంధించి ఆధారాలను సమర్పించడంతో పాటు, అప్పటి భారత రాష్ట్రపతికి కూడా ఈ సమస్యను వివరించినట్లు ఆయన తెలిపారు. తన ఫిర్యాదుల అనంతరం సంబంధిత అధికారులు పరిశీలన, విచారణ చేపట్టారని, వారి సహకారంతో సుమారు 10,000 మంది భారతీయులను తిరిగి స్వదేశానికి తీసుకురావడం జరిగిందని చాంద్ పాషా పేర్కొన్నారు.అయితే, ఈ పరిణామాల్లో పలువురు భారతీయులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం ఈ సమస్య మరింత తీవ్రమైందని, దీనిపై తక్షణ చర్యలు అవసరమని హెచ్చరించారు.

తెలంగాణలోని జగిత్యాల యువకుడి మరణంతో మరింత ఆందోళన

ఇటీవల తెలంగాణలోని జగిత్యాల--కోరుట్ల ప్రాంతానికి చెందిన ఒక యువకుడు విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న ఈ తరహా సమస్యకు సంబంధించిన పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు చాండ్ పాషా ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు ప్రభుత్వాలు, కుటుంబాలు అప్రమత్తం కావడానికి హెచ్చరికలుగా నిలవాలని ఆయన అన్నారు. నిరుద్యోగ యువత ఆర్థిక ఇబ్బందులను, విదేశాల్లో ఉద్యోగం సంపాదించాలనే ఆశలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే రిక్రూట్‌మెంట్ నెట్‌వర్క్‌ల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

ప్రపంచ శాంతి సంస్థకు, అంతర్జాతీయ వేదికలకు విజ్ఞప్తి

ఈ తీవ్రమైన సమస్యను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించి, సంబంధిత ప్రభుత్వాలు మరియు అంతర్జాతీయ సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని డాక్టర్ షేక్ చాంద్ పాషా సుధీర్ తారే గారికి, ప్రపంచ శాంతి సంస్థకు విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యను అరికట్టేందుకు సంబంధిత అధికారులు కింది చర్యలు చేపట్టాలని కోరారు

– విమానాశ్రయాల్లో కఠిన తనిఖీలు: అనుమానాస్పద విదేశీ ఉద్యోగ ఆఫర్లు, ప్రయాణ ఏర్పాట్లు, రిక్రూట్‌మెంట్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

– రిక్రూట్‌మెంట్ ముఠాలపై విచారణ: ఉద్యోగాల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏజెంట్లు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఉద్యోగ వీసాల ధృవీకరణ: ఉద్యోగ నిమిత్తం విదేశాలకు వెళ్లేవారికి నిజమైన ఉద్యోగ ఆఫర్లు, సరైన పత్రాలు ఉన్నాయో లేదో నిర్ధారించాలి.

– విదేశాల్లో చిక్కుకున్న భారతీయులకు రక్షణ: ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయులకు తక్షణ సహాయం, న్యాయపరమైన మద్దతు, సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలి.

– అంతర్జాతీయ సమన్వయం: భారత ప్రభుత్వ అధికారులు, విదేశీ ప్రభుత్వాలు, రాయబార కార్యాలయాలు, అంతర్జాతీయ సంస్థలు సమన్వయంతో పనిచేసి యువత దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

"భారతీయ యువతను రక్షించడం జాతీయ ప్రాధాన్యత కావాలి"

ఈ సమస్య కేవలం కొన్ని వ్యక్తుల కు సంబంధించినది మాత్రమే కాదని, ఇది భారతీయ పౌరుల భద్రత, గౌరవం , భవిష్యత్తుకు సంబంధించిన తీవ్రమైన జాతీయ సమస్య అని చాండ్ పాషా స్పష్టం చేశారు.మరిన్ని కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోకముందే అందరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువత,వారి తల్లిదండ్రులు డబ్బులు చెల్లించే ముందు లేదా విదేశాలకు ప్రయాణించే ముందు ఉద్యోగ ఆఫర్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు, ఉద్యోగ ఒప్పందాలు, వీసా వివరాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.

డాక్టర్ షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ:

"భారతీయ యువత తమ కుటుంబాలను పోషించుకోవాలని, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎన్నో ఆశలతో విదేశాలకు వెళ్తున్నారు. అలాంటి యువత తప్పుడు ఉద్యోగ హామీలతో మోసపోవడం లేదా ప్రమాదకరమైన యుద్ధ పరిస్థితుల్లోకి నెట్టివేయబడటం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదు.ఇది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తక్షణ దృష్టి సారించాల్సిన తీవ్రమైన సమస్య. సంబంధిత అధికారులు, అంతర్జాతీయ శాంతి సంస్థలు వెంటనే జోక్యం చేసుకుని, కఠిన తనిఖీలు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను."విదేశాల్లో ఉన్న భారతీయ పౌరుల భద్రతను కాపాడటం,విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టడం, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే యువత సురక్షితంగా,చట్టబద్ధంగా తమ లక్ష్యాల ను సాధించేలా చూడటం అత్యంత ముఖ్యమని ఈ సమావేశంలో ప్రాధాన్యతగా చర్చించారు.

చర్లపల్లిలో ఉపాధి హామీ పనుల పరిశీలన

చురకలు విలేకరి, బీర్పూర్, నవంబర్ 3 : బీర్పూర్ మండలంలోని చర్లపల్లి గ్రామంలో జిల్లా అదనపు డీఆర్డీవో మదన్ మోహన్ వీబీజీ రామ్ జీ పనులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు.నర్సింహులపల్లి గ్రామంలో కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, వీబీజీ రామ్ జీ సిబ్బంది, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీబీజీ రామ్ జీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ప్రతిరోజూ 1000 మంది లేబర్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

-నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం కావాలి



చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 3 : తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. కరీంనగర్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని, సరైన విచారణ లేకుండా ఏ ఒక్క అర్హులైన ఓటరు పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డిలీషన్ జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పేరు తొలగించడానికి గల కారణాలు, అందుకు సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఓటరు నుంచి వచ్చిన అభ్యంతరాలు, వివరణలు, సమర్పించిన పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు, ఫారం-7 ద్వారా వచ్చిన అభ్యంతరాలు, ఓటరు పేరు తొలగింపునకు సంబంధించిన అభ్యర్థనలు, ఫారం-8 ద్వారా వచ్చిన చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలు తదితర దరఖాస్తుల పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో పేరు చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయానికి స్పష్టమైన కారణాలు తెలియజేస్తూ స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన నోటీసులు, నోటీసుల అందజేత వివరాలు, విచారణ నివేదికలు, ఓటర్లు సమర్పించిన ఆధారాలు, సంబంధిత పత్రాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని తెలిపారు. భవిష్యత్తులో ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులు అందుబాటులో ఉండేలా పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం స్పందించేందుకు, తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి విచారణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి దశలో తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.జిల్లాల వారీగా ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితా, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అన్ని వివరాలను మరోసారి పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో, నవంబర్ 26, 2026వ తేదీలోగా నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 30, 2026వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున, ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

-రోడ్డు భద్రత పనులకు అవసరమైన నిధుల అంచనాలు సిద్ధం చేయాలి

-మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణాలు

-రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలందించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో అంబులెన్స్ ప్రారంభం

-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 3 : సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులతో పాటు ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను విశ్లేషించి వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశం లో తీసుకున్న నిర్ణయాల అమలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేపట్టాల్సిన చర్యలు, జాతీయ రహదారులపై రోడ్డు భద్రత మెరుగుదల పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 600 కిలోమీటర్ల మేర రహదారులు ఉన్నాయని, వీటి పై గత నెల రోజుల్లో ఎన్ని ప్రమాదాలు జరిగాయి, ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి అనే వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు, ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను విశ్లేషించాలన్నారు. ఇక పై జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్‌డబి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయం తో ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. ప్రమాదం జరగడానికి గల అసలు కారణాలను గుర్తించి, భవిష్యత్తు లో అదే ప్రాంతంలో మరో ప్రమాదం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టమైన సూచనలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే వారం, 10 రోజులలో మరోసారి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహిస్తామని, అప్పటి లోగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణ నివేదిక సమర్పించాలని తెలిపారు. ప్రమాద ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, వేగ సూచిక బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోడ్డు భద్రత మెరుగుదల పనులకు అవసరమైన నిధుల అంచనాలను వెంటనే రూపొందించి, పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో జరిగే ప్రమాదాల్లో దాదాపు సగం జాతీయ రహదారులపైనే చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో నిర్లక్ష్యం వహించకుండా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, జాతీయ రహదారులపై తక్షణ చర్యలు చేపట్టకపోతే ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకునేలా చూస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

జాతీయ రహదారుల పై తాత్కాలిక మెరుగుదల పనులు...

జాతీయ రహదారుల పై నిర్వహణ, స్వల్పకాలిక మెరుగుదల పనులకు సంబంధించి టెండర్ ముగిసినందున త్వరలోనే నిర్వహణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పనులను వేగవంతంగా చేపట్టి రహదారులపై ప్రయాణం సురక్షితంగా ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ పనుల్లో భాగంగా రహదారులపై రాత్రివేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా రిట్రో రిఫ్లెక్టివ్ హెచ్చరిక, తప్పనిసరి, సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. మలుపుల వద్ద చెవ్రాన్ మార్కర్లు, అడ్డంకులు, ప్రమాద సూచిక మార్కర్లు, రిఫ్లెక్టివ్ బ్యాండ్లతో కూడిన రోడ్ డెలినేటర్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ తో లేన్ మార్కింగ్‌లు, సెంటర్ లైన్లు, రోడ్డు అంచుల గుర్తులు, ట్రాన్స్‌వర్స్ మార్కింగ్‌లు వేయడంతో పాటు వాహనదారులకు రాత్రి వేళల్లో రహదారి స్పష్టంగా కనిపించేలా రిఫ్లెక్టివ్ రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయనున్నారు.

వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు...

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. 5, 10, 15 మిల్లీమీటర్ల ప్రొఫైల్ తో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, గుర్తించిన ప్రాంతాల్లో సోలార్ ఆధారిత ఎల్ఈడీ బ్లింకర్ల ఏర్పాటు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రమాద ప్రాంతాల్లో, బ్లాక్ స్పాట్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడంతో పాటు కొండగట్టు వద్ద ప్రమాదకర మలుపుల ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ముందుగానే అప్రమత్తమయ్యేలా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలను తొలగించడం, అనధికార పార్కింగ్‌ను నియంత్రించడం, నిఘా, పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలులో భాగంగా చేపట్టిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీసు శాఖ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమావేశమై పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ఎక్కువగా గాయపడుతున్నారని, తలకు గాయాలు కావడం వల్ల మరణాల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అతివేగ నియంత్రణ చర్యలను మరింత విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను సమర్థవంతంగా గుర్తించి నియంత్రించేందుకు ఏఐ ఆధారిత కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిబంధనలను ఉల్లంఘించే వాహనాలను గుర్తించి ఈ-చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు. అదేవిధంగా ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి భద్రతా జాకెట్లు, బారికేడ్లు, హైబ్రిడ్ కెమెరాలు, హెల్మెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసే కెమెరాల ద్వారా రహదారులపై పక్షి దృష్టితో (బర్డ్ ఐ వ్యూ) విస్తృత ప్రాంతాన్ని పర్యవేక్షించి ట్రాఫిక్ ఉల్లంఘనలను మెరుగ్గా గుర్తించవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించి ప్రాణాలను కాపాడేలా అత్యవసర స్పందన వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులపై ఏవైనా సమస్యలు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌హెచ్ఏఐ టోల్ ఫ్రీ నంబర్ 1033కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబా, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవి తాగునీటి సరఫరాపై మున్సిపల్ అధికారుల సమీక్ష



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 03 : రానున్న వేసవిలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నిర్మల్ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ఎస్సారెస్పీ ప్రాజెక్టును ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలించి,రానున్న వేసవిలో పట్టణానికి తాగునీటి సరఫరా పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలను పరిశీలిస్తే నిర్మల్ పట్టణ ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడే పరిస్థితి లేదని,వేసవి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని పేర్కొన్నారు.ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, ప్రత్యామ్నాయ చర్యల ద్వారా సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. తాగునీటి పైపులైన్లలో లీకేజీలు ఏర్పడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎక్కడైనా నీటి లీకేజీలు గుర్తించినట్లయితే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని పట్టణ ప్రజలను కోరారు. వేసవి కాలంలో ప్రజలకు నిరంత రాయంగా తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,నీటి సంరక్షణ లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అప్పాల గణేష్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపు గోపి, పెండం శ్రీనివాస్, నాందేడపు చిన్ను, రఫీ, చెనిగరపు నరేష్, జకి, శ్రీకాంత్ యాదవ్, డీఈ హరిభువన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ విమర్శలు సరికావు

-కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 3 : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు నాయకత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను స్థానిక దళిత, కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంథని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం మాట్లాడుతూ దళితులకు, పేదలకు దుద్దిళ్ల కుటుంబం ఎప్పుడూ అండగా నిలుస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. మంథనిలో శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రాజకీయ రంగు పులమడం తగదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను విమర్శించడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తుందన్నార. జేఎన్‌టీయూహెచ్‌లో ఉద్యోగాలు కోల్పోయిన దళితులకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో మంత్రి శ్రీధర్ బాబు చొరవ చూపారని, మంథని మధుకర్ కుటుంబానికి అండగా నిలిచి ఇద్దరికి ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. నిరుద్యోగులకు ఉచిత కోచింగ్, పేదలకు వైద్య సహాయం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత విమర్శలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై అనవసర వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. అతి త్వరలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని నియోజకవర్గం లోని దళితులకు పెద్ద నామినేటెడ్ పోస్ట్ రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంథని రాజేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనగామ నర్సింగరావు, ఐలి శ్రీనివాస్, దొరగొర్ల శ్రీనివాస్, అక్కపాక సంపత్ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులపై

ఈగ వాలినా కందిరీగల్లా కదిలివస్తాం

-బండలింగంపల్లి ఉప సర్పంచ్ బొడ్డు రాజుపై కత్తి దాడిని ఖండించిన రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు కార్తీక్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 03 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ ఉప సర్పంచ్ బొడ్డు రాజుపై జరిగిన కత్తి దాడిని ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు కార్తీక్ తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయపడిన బొడ్డు రాజును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాజుకు ఫోరం తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు.గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్న ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం దురదృష్టకరమని బొడ్డు కార్తీక్ అన్నారు. ప్రజాసేవలో ఉన్న ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడ టాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా వారి సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులందరికీ అండగా నిలబడతామని, ఎవరిపై అన్యాయం జరిగినా సంఘటితంగా పోరాడుతామని భరోసా ఇచ్చారు.ఉప సర్పంచులు, వార్డు సభ్యులపై ఈగ వాలినా కందిరీగల్లా కదిలివస్తామని హెచ్చరించారు.ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కమలాకర్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు మందాటి రాము యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి అనిల్,బాల్ రెడ్డి పాల్గొని బొడ్డు రాజుకు సంఘీభావం తెలిపారు.



ఆ "డెడ్ బాడీ" ఎవరిది?

-సింగాపురం శివారులో గుర్తు తెలియని మృతదేహం

-పోలీసుల విచారణ



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 3 : వరంగల్ కరీంనగర్ జాతీయ రహదారి పక్కన హుజూరాబాద్ మండలం సింగాపురం శివారులో వ్యవసాయ బావిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని మంగళవారం గ్రామస్తులు కనుగొన్నారు. సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు నీలిరంగు చొక్కా ధరించి ఉన్నాడు. అతని వయసు 30 నుండి 35 సంవత్సరాల వరకు ఉండొచ్చు అని భావిస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే తమకు తెలియజేయాలంటూ పోలీసులు మృతదేహం ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇదిలా ఉంటే అతను ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడ్డాడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా సింగాపురం శివారులో వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం కావడం స్థానికంగా చర్చనీయాంశం అయింది.

టీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా పొన్నం శిరీష నియామకం



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 3 : తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ నాయకురాలు పొన్నం శిరీష నియమితులయ్యారు. ఇటీవల నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆమెను ఈ పదవికి ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి, మహిళా సమస్యల పరిష్కారానికి ఆమె చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పొన్నం శిరీష నియామకం పట్ల హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి టీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి శిరీష కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా డా. ఎల్.మణికంఠ జన్మదిన వేడుకలు



చురకలు విలేకరి జగిత్యాల,నవంబర్ 3 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ తనయుడు డాక్టర్ ఎల్.మణికంఠ జన్మదిన వేడుకలను మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసంలో విద్యార్థులకు ఒక్కరోజు భోజనం ఖర్చు అందజేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.మానవతా దృక్పథంతో వేడుకలు నిర్వహించినందుకు ఆవాస నిర్వాహకులు బీఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్లు కోరుకంటి రాము,తోట హరీష్,నాయకులు అస్గర్ మహమ్మద్ ఖాన్,పులి మల్లేశంగౌడ్, వసీం మహమ్మద్ అలీ,గాజుల శ్రీనివాస్,గుండేటి మారుతి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ శ్రీనివాస్ జాదవ్‌కు టీయూడబ్ల్యూజే ఘన నివాళి



చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 3 : జన గొంతుక ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ జాదవ్ మృతి పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ కార్యదర్శి నగునూరి శేఖర్ మాట్లాడుతూ.. జాదవ్ అకాల మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్ తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్, రాష్ట్ర అనుబంధ కమిటీ సభ్యుడు నర్సింగోజు మహేంద్రాచారి ,తోట రమణ,బండి రఘు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చెల్పూరులో... అక్రమ రియల్ వెంచర్‌పై డిఎల్‌పిఓ విచారణ

-అక్రమ రియల్ దందా పై లెటర్‌కు ఫిర్యాదు చేసిన చెల్పూర్ మాజీ -సర్పంచ్ కాంగ్రెస్ నేత నేరెళ్ల మహేందర్



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 3 : హుజురాబాద్ మండలం చెల్పూరులో అక్రమ లేఅవుట్లపై అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ప్లాట్ల విక్రయాలపై అధికారుల విచారణ తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. చెల్పూరు మేజర్ గ్రామ పంచాయతీలోని ఆర్టీసి బస్టాండ్ సమీప ప్రాంతం, సర్వే నంబర్ 967/ఎ లోని 14 గుంటల ప్రైవేటు భూమిలో వెలసిన వెంచర్ పై అధికారులు విచారణ నిర్వహించారు.కనీసం రోడ్డుకు స్థలం కేటాయించకుండా,ఎలాంటి నాలా కన్వర్షన్ చేయించుకోకుండా, పంచాయతీ అనుమతులు లేకుండానే ఈ భూమిని 8 ప్లాట్లుగా విభజించి అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో ఇక్కడ అనుమతులు లేని భూమిని ఎవరూ కొనవద్దని అధికారులు హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు.అయితే,ఆ నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు యత్నించడంతో వివాదం మరింత ముదిరింది. విచారణ అనంతరం డీఎల్‌పీవో శ్రీనివాస్ మాట్లాడుతూ..“ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ లేఅవుట్లు, క్రయ విక్రయాలు చేపడితే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. విచారణ నివేదిక ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే, ఉన్నతాధికారులకు నివేదించి రిజిస్ట్రేషన్ రద్దుకు సిఫార్సు చేస్తాం.” అని స్పష్టం చేశారు. ఇదే భూమిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుడికి మార్కింగ్ ఇవ్వడంతో వివాదం తారాస్థాయికి చేరింది. దీనిపై గ్రామ ఉపసర్పంచ్ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం హుజురాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) శ్రీనివాస్, ఎంపీవో రాజేందర్ గ్రామానికి చేరుకున్నారు.స్థానిక సర్పంచ్ పంతడుపుల కస్తూరి, ఉపసర్పంచ్ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి బానోతు రమేష్ సమక్షంలో దాదాపు నాలుగు గంటల పాటు సమగ్ర విచారణ చేపట్టారు.గ్రామ పంచాయతీ పరిధిలో రహదారులను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కూడా కఠినచర్యలు తీసుకోవాలని స్థానికులు,గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

మంత్రి శ్రీధర్ బాబుపై చౌకబారు ప్రకటనలు చేస్తే తస్మాత్ జాగ్రత్త

-ఖబర్దార్ ఎంపీ గడ్డం వంశీ -పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 3 : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి యే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు పైన పెద్దపల్లి ఎంపీ వంశీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావులు మాట్లాడుతూ రాష్ట్రనియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో సస్యశ్యామలంగా ఉండాలని సదుద్దేశంతో సొంత ఖర్చులతో మంత్రి శ్రీధర్ బాబు మైసూర్ పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద స్వామీజీని తీసుకు వస్తే మంత్రి శ్రీధర్ బాబు పైన ఓర్వలేక ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.ఆధ్యాత్మికంగా అందరూ సోదర భావంతో మెలగాలని ఉద్దేశంతోనే స్వామీజీని తీసుకురావడం జరిగిందని, ప్రజల సొమ్ముతో ఖర్చు పెట్టలేదని, మంత్రి శ్రీధర్ బాబు సొంత ఖర్చుతో సమావేశం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని తలపెట్టిన దీక్షకు హాజరు కాకపోతే వ్యంగంగా విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు.రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసే తపనతో మంత్రి శ్రీధర్ బాబు పని చేస్తున్నారని గుర్తు చేశారు. కర్ణాటక,తెలంగాణ,చుట్టుపక్క రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి మంత్రి శ్రీధర్ బాబు కృషి చేశారని తెలిపారు.పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ నిలకడ లేకుండా పార్టీలు మారే మీ కుటుంబం, మంత్రి శ్రీధర్ బాబు పైన విమర్శ వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదని ప్రశ్నించారు.పెద్దపల్లి నియోజకవర్గం నుండి ఎంపీగా వంశీకృష్ణ గెలవడానికి మంథని నుండి భారీ మెజార్టీతో గెలిపించామని,ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడ్డారని గుర్తుపెట్టుకోవాలని అన్నారు.మంథని ప్రాంతం ఇంత భారీ మెజార్టీ ఇస్తే, ఈ ప్రాంతానికి ఏమిచ్చారని ప్రశ్నించారు? విద్యార్థులకు రెండు మూడు బ్యాగులు ఇవ్వడం కాదని,యువతకు కంపెనీలు తేవాలని సూచించారు. రెండు మూడు బ్యాగులను పంచితే కాంగ్రెస్ వారిని వెంట పెట్టుకోవాలి తప్ప, బీఆర్ఎస్ నాయకులను వెంటపెట్టుకొని తిరగడం మానుకోవాలని అన్నారు. మంథని ప్రాంతానికి పర్యటిస్తే ఎవరికి సమాచారం ఇచ్చారని ప్రశ్నించారు. మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల పార్టీ నాయకులకు ఏ ఒక్కరికి తెలియకుండా సందర్శించడం తగదని వివరించారు. ఇప్పటికైనా అనుచిత వాక్యాలు మానుకొని మెలగాలని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరవేని లింగయ్య యాదవ్, వేల్పుల రాజు, ఐలి శ్రీనివాస్, ఎల్లంకి వంశీ, బెల్లంకొండ సత్యనారాయణ రెడ్డి, మంథని రాకేష్, ఇందారపు అనిల్, అక్కపాక సంపత్ , దొరగొర్ల శ్రీనివాస్ యాదవ్, పెట్టెం రామస్వామి తిరుమల్ పంచిక దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన చేస్తే కఠిన చర్యలు

-సయ్యద్ జుబేర్‌పై రౌడీషీట్ ఓపెన్





చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట నవంబర్ 03 : మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్ర చారి హెచ్చరించారు.ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన సయ్యద్ జుబేర్ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అతని నేర ప్రవృత్తిని పరిగణనలోకి తీసుకొని అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించే వారిపై, ముఖ్యంగా మహిళలను వేధిస్తూ అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతకు, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

కుష్ట వ్యాధి గుర్తింపు సర్వేను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

-ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి -వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 03 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహిస్తున్న ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమంలో భాగంగా తంగళ్లపల్లి మండలంలో చేపడుతున్న ఇంటింటి కుష్ట వ్యాధి గుర్తింపు సర్వేను రాష్ట్ర పరిశీలకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్‌తో కలిసి సర్వే నిర్వహణ తీరును సమీక్షించారు. ఆశా కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ పరిశీలిస్తున్న విధానాన్ని, అనుమానిత లక్షణాల గుర్తింపు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.కుష్ట వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించ వచ్చని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. చర్మంపై స్పర్శ జ్ఞానం లేని మచ్చలు, రాగి రంగులో కనిపించే మచ్చలు ఉన్నవారు వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.సర్వేలో నిర్లక్ష్యం వహించ కుండా ప్రతి ఇంటినీ సందర్శించి, ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి ఆదేశించారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే తగిన చికిత్స అందించాలని సూచించారు.కుష్ట వ్యాధి పట్ల ప్రజలు అపోహలు వీడి, ఆరోగ్య సిబ్బందికి సహకరించి ఇంటింటి సర్వే విజయ వంతం చేయాలని అధికారులు కోరారు.

రవీందర్ సింగ్ మాటలు కాదు...

గంగుల చిలుక పలుకులవి

-ముస్లిం సమాజం బిఆర్ఎస్ కు ముగ్గురు కార్పొరేటర్లను గెలిపిస్తే..మీరేమో ముస్లింల మనోభావాలను దెబ్బ తీస్తారా
-అదాలత్ మస్జిద్ భూమి జోలికొస్తే మరో ఉద్యమం రాజుకుంటుంది
-ఎమ్మెల్యే వక్ఫ్ భూమిని కాజేస్తే సింగ్ కన్ను మస్జిద్ భూమిపై పడిందా
-రవీందర్ సింగ్ అబద్ధపు ప్రచారాన్ని ఖండించిన ఎంఐఎం యూత్ లీడర్ మెరాజోద్దీన్

కరీంనగర్, నవంబర్ 03 : మాజీ మేయర్, బిఆర్ఎస్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్, అదాలత్ మస్జిద్ వక్ఫ్ భూమి అంశంపై మాట్లాడిన మాటలు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చిలుక పలుకుల వలె ఉన్నాయని, ఎంఐఎం పార్టీ యూత్ లీడర్ మహమ్మద్ మేరాజోద్దీన్ ఎద్దేవా చేశారు. అదాలకు మస్జిద్ కు సంబంధించిన భూమి అంశంపై కార్పొరేటర్ రవీందర్ సింగ్ మాట్లాడిన వ్యాఖ్యలను ఒక పత్రిక ప్రకటనలో మంగళవారం మేరాజోద్దీన్ ఖండించారు. ప్రజల పన్నులతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ వారు, అదాలత్ మస్జీద్ భూమిని (ప్రధాన కూరగాయల మార్కెట్ భూమి)ని కొనుగోలు చేసిందనే రవీందర్ సింగ్ అబద్ధపు విష ప్రచారాన్ని కొట్టిపారేశారు. రవీందర్ సింగ్ 5యేండ్లు మేయర్ గా, మరో 5ఏండ్లు బిఆర్ఎస్ మేయర్ గా ఉన్నప్పుడు, ప్రజల పన్నులతో మార్కెట్ భూమి కొనుగోలు చేసిందనే, అప్పుడు ఆమాట ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రవీందర్ సింగ్ ఇద్దరు కలిసి కరీంనగర్ లో బిజెపిని బలోపేతం చేసేందుకు కపటనాటకం ఆడుతున్నారని ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ పార్టీ, హిందూ సమాజం ఓట్లు పొందడం కోసం చేస్తున్న కుటిల



ప్రయత్నంలో భాగంగా.. మేము ముస్లింలకు వ్యతిరేకంగానే ఉన్నామనే మెసేజ్ హిందూ సమాజం దృష్టిలో పడేందుకు చేసిన కుట్రలో భాగంగానే మార్కెట్ అదాలత్ మస్జిద్ భూమి ఇప్పుడు తెరమీదకి తీసుకొచ్చారని విమర్శించారు. గెజిట్ ప్రకారం మార్కెట్ కు సంబంధించిన రెండు ఎకరాలకు పైచిలుకు భూమి వక్ఫ్ బోర్డుదేనని చెప్పారు. ప్రస్తుతం కోర్టులో కేసు పెండింగ్లో ఉండగా ఇప్పుడు ఉన్న ఫలంగా ఈ అంశం ఎందుకు తెర మీదికి తీసుకొచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. రవీందర్ సింగ్, ఎమ్మెల్యే గంగుల ఇద్దరు కలిసి, కరీంనగర్ లో బీజేపీని అడ్డుకునే శక్తి మాకే ఉందని, మేమె మొనగాళ్లమని, తీరా ఇప్పుడు అదే బిజెపి మేయర్ పీఠం కైవసం చేసుకుంటుంటే ఎందుకు సైలెంట్ అయ్యారో చెప్పాలన్నారు. ఉన్నత విద్యావంతుడు, న్యాయవాది, 6సార్లు కార్పొరేటర్, మేయర్, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేసిన రవీందర్ సింగ్, అదాలత్ మస్జిద్ మార్కెట్ భూమి అంశం ఉల్కాపాతం జారిపడ్డట్లు, ఇప్పుడే ఎందుకు గుర్తుకొచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్లో బిజెపి ఎమ్మెల్యేను గెలిపించేందుకు జరుగుతున్న ప్రయత్నంలో భాగంగానే ఈఅంశం, ఉన్నట్టుండి తెరమీదకి తీసుకొచ్చారని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం దృష్టిలో అదాలత్ మస్జిద్ మార్కెట్ భూమి ఉన్నప్పటికీ, బిఆర్ఎస్ అధిష్టానానికి వ్యతిరేకంగా, బిజెపిని బలోపేతం చేయడానికి చేసుకున్న లోపాయకారి ఒప్పందంలో భాగంగానే, ఎమ్మెల్యే, రవీందర్ సింగ్ ఇద్దరు కలిసి ఈకుటిల రాజకీయానికి తెర లేపారని మండిపడ్డారు. ఎమ్మెల్యే గంగుల వక్ఫ్ భూమిని కొల్లగొట్టినట్లు, అదాలత్ మస్జిద్ వక్ఫ్ భూమిపై రవీందర్ సింగ్ కన్ను పడిందా అని ప్రశ్నించారు. అదాలత్ మస్జిద్ భూమి జోలికొస్తే ఖబర్దార్ రవీందర్ సింగ్ నువ్వు కాదు నీ జేజమ్మ వచ్చిన వదిలిపెట్టేది లేదని, కరీంనగర్ ముస్లిం సమాజాన్ని ఏకం చేసి, అదాలత్ మస్జిద్ వక్ఫ్ భూమి సాధించేంతవరకు పెద్ద ఎత్తున, మరో ఉద్యమానికి, ఉవ్వెత్తున ఎగిసిపడే ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. గంగుల చిలక పలుకులు మానుకోవాలని ముస్లిం సమాజం యొక్క మనోభావాలు దెబ్బతీయొద్దని హితువు పలికారు. బిఆర్ఎస్ పార్టీకి 3గ్గురు కార్పొరేటర్లను ముస్లిం సమాజం గెలిపించి బహుమానంగా ఇస్తే, అదే బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యే, మాజీ మేయర్, ఇద్దరు కలిసి అదాలత్ మస్జిద్ భూమి జోలికొస్తున్నారంటే కరీంనగర్ ముస్లిం సమాజం రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని, గంగుల కమలాకర్ కు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

హెల్పింగ్ నేచర్ చిన్న సినిమా.. పెద్ద సందేశం..



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ నవంబర్ 3 : హెల్పింగ్ నేచర్ చిన్న సినిమా ఎంతో సందేశం ఇచ్చిందని ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, ఎన్ సి పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివార స్వామి క్షేత్రంలో డ్యాన్స్ మాస్టర్ దర్శకుడు పులిపాక దేవా దర్శకత్వం వహించిన హెల్పింగ్ నేచర్ అనే చిన్న సినిమాను మంగళవారం శ్రీ ఆది వరహాకి స్వామి క్షేత్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ప్రజలకు సందేశం ఇచ్చే చిన్న సినిమాలు తీయాలని దీనికి తమ మద్దతు ఉంటుందని రాజు మరియు శ్రీధర్లు పేర్కొన్నారు. ఈ సినిమాలో సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్ తమ పాత్రకు పూర్తిగా న్యాయం చేశాడని అన్నారు. నలుగురికి సందేశం ఇచ్చే సినిమాలు తీసి ప్రజలతే మన్ననలు పొందాలని వారి పేర్కొన్నారు. ఉన్నదాంట్లో నలుగురికి సహాయం చేయడమే హెల్పింగ్ నేచర్ అని ఇటువంటి సినిమాలు తీసి ప్రజలకు తెలిసేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, లొంగకేసారం మాజీ సర్పంచ్ ఎండి మంజూరు, ఉప సర్పంచ్ రఫీ సోహెల్, నటీనటుల పద్మలత, మడిపోజు మానస సతీష్, వీర్ల ప్రశాంత్, మేజిక్ శశి, అంజలి, మధునయ్య, సునీల్, దామెర దేవయ్య,శివ, సినిమా దర్శకుడు కందుల వెంకీ, తదితరులు నటులు తమ పాత్రలకు ప్రాణం పోశారు.

తీరిన విద్యుత్ సమస్య



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 3 : రామగిరి మండలం కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ప్రత్యేక చొరవతో విద్యుత్ సమస్యకు చెక్ పెట్టడం జరిగింది.రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని గొల్లపల్లె మరియు కౌండిన్యనగర్ ప్రాంతంలో నూతన మీటర్ కనెక్షన్ పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పనులు చేపట్టారు.నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్లు వేయడంతో పాటు వీధి దీపాలను సైతం ఏర్పాటు చేశారు.కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ప్రత్యేక చొరవతో కొత్త మీటర్ కనెక్షన్ మంజూరు చేయించి, సంబంధిత విద్యుత్ పనులు పూర్తి చేయించి స్థానికులకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గొల్లపల్లె మరియు కౌండిన్యనగర్ ప్రాంతంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, వీధి దీపాల ఏర్పాటుతో రాత్రివేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందించనున్నారు.గ్రామంలోని ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి తెలిపారు. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపిన సర్పంచ్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ ఆకుల శ్రీనివాస్,వార్డు సభ్యులు,కరెంట్ సిబ్బంది,గ్రామపంచాయతీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఐదు రకాల పంటలు సాగు చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..

-మానాలలో నీటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలు సాగు చేస్తున్న రైతు తూము గంగాధర్
-పరిశీలించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల,సపంబర్ 03 : రుద్రంగి మండలం మానాలలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ.. ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు రైతు తూము గంగాధర్. విభిన్న రకాల పంటలు వేసి.. మంచి ఆదాయం వచ్చేలా ముందుకు సాగుతున్నారు ఆ రైతు. క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి రైతును అభినందించారు.రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన తూమ్ గంగాధర్ తన ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో ఉన్న నీటిని సద్వినియోగం



చేసుకుంటూ.. ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు. పసుపు 20 గుంటలు, వెల్లుల్లి 10 గుంటలు, ఉల్లిగడ్డ 10 గుంటలు, మిర్చి 10 గుంటలు, కొత్తిమీర 10 గుంటల్లో సాగు చేస్తున్నారు. ఉన్న నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ.. ఆయా పంటలు సాగు చేస్తున్నారు.

ఎక్కడ విక్రయిస్తారు..?
ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు రైతు

తూము గంగాధర్ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పసుపు, వెల్లుల్లి ఇతర పంటలను పరిశీలించి.. పంట ఎన్ని రోజులకు కోతకు వస్తుంది? ఎంత దిగుబడి వస్తుంది?ఎక్కడ విక్రయిస్తారు? ఎంత ఆదాయం వస్తుందో ఆరా తీశారు. పసుపు స్థానిక లేదా కోరుట్ల, మెట్ పల్లి, నిజామాబాద్ కేంద్రాలకు తరలించి అమ్ముతామని రైతు చెప్పారు. మిగతా పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.



పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్,జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



రైతులు కంట నీరు పెట్టకుండా చూడండి

-ఇల్లంతకుంట ఏఎంసీ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి హితవు



చురకలు విలేఖరి,తిమ్మాపూర్

నవంబర్ 03 : రైతులు కంటనీరు పెట్టకుండా వారి అభివృద్ధి సంక్షేమానికి పాటు పడాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంపై ఉందని మానకొండూరు ఎమ్మెల్యే టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ శ్రీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా అంతగిరి సాహిత్య వినయ్ కుమార్,వైస్ చైర్మన్‌గా భరత్ రెడ్డి, డైరెక్టర్లుగా వి.మల్లయ్య, బడుగు లింగయ్య,వి.శ్రీనివాస్ రెడ్డి, జెట్టి మల్లేశం,మంద బాల్ రెడ్డి,వెలిశాల జ్యోతి,బంగారి అంజయ్య,ఎరుకల తిరుపతి,జుట్టు నగేష్,ఎం.నవీన్ రెడ్డి, ఉప్పల వేణు,జి.శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా అందించే సేవలతో రైతులు సంతోషంగా ఉండాలే తప్ప బాధతో కంటనీరు పెట్టే పరిస్థితి కల్పించొద్దన్నారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని,మార్కెట్ కమిటీకి రైతులు అండగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్ నిత్యం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఇల్లంతకుంట మార్కెట్ కమిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు.ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ మార్కెట్ ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తూ రైతులు పండించి పండించిన ధాన్యానికి భద్రత కల్పించేందుకు గోదాముల నిర్మాణం అనేక వసతులు కల్పించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. రైతులకు మార్కెట్లో అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పాలకమండలి పని చేయాలని సందర్భంగా పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఆది నుండి కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి పాటుపడుతూనే ఉందని ఆ క్రమంలోనే రేవంత్ రెడ్డి సర్కారు ఈ దిశగా ముందుకు సాగుతున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో లక్ష రూపాయల రుణ మాఫీ చేయగా,కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణ మాఫీ చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో తూకాల పేరుతో భారీ మోసాలు జరిగాయని, వాటికి చెక్ పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల కొనుగోలు కేంద్రాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు కూడా జమ అవుతుందని ఆయన చెప్పారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు లాభం,గిట్టుబాటు కల్పిస్తున్నామని చెప్పారు.రైతులకు రైతుపై ట్రాక్టర్లు, విత్తనాలు,ఎరువులు ఇప్పిస్తున్నామన్నారు .ఎల్‌నినో ప్రభావం రానున్న రోజుల్లో తీవ్ర రూపం దాల్చనున్నదని, ఈ దృష్ట్యా రైతులు ఆరు తడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన చెప్పారు.

అక్రమంగా సాగునీరు మళ్లింపు

మిడ్ మానేరు నుంచి అనంతరం మల్లన్న సాగర్ మీదుగా వచ్చే నీటిని పైపు లైన్ల ద్వారా అక్రమంగా కేసీఆర్ తన రేవల్లి లో ఫామ్ హౌస్ వద్ద వంద ఎకరాల్లో నిర్మించిన చెరువుకు మళ్లించారని ఎమ్మెల్యే ఆరోపించారు.

ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలి

అందరికీ పదవులు సాధ్యం కానప్పటికీ కష్టపడ్డోళ్లకు మాత్రం పదవులు కట్టబెట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. కష్టపడుతున్న వారికి పదవులు కల్పించే విషయంలో నిరంతరం తన ప్రయత్నం కొనసాగుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.పదవులు రానంత మాత్రాన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు నిరాశ పడకూడదని, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపిక, సహనం,సంయమనం కోల్పోకూడదని ఆయన సూచించారు. నిరీక్షణ, ఓపిక తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం

ఏఎంసి పాలకవర్గ ప్రమాణ స్వీకారం స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు ఇల్లంతకుంటకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు భారీగా తరలివచ్చి మంగళహారతులతో స్వాగతం పలికారు. క్రేన్ సహాయముతో గజమాలవేసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆ మహనీయుని విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఎడ్లబండిపై సభా ప్రాంగణానికి బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రజా పాలన రథం ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.స్థానిక బస్టాండ్ చౌరస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహానికి, తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం సభా ప్రాంగణానికి డప్పు చప్పులతో ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఇల్లంతకుంట,పాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి,మానకొండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి,బెజ్జంకి నుస్తులాపూర్, పోరండ్ల, ఊటూరు పాక్స్ చైర్మన్లు ఒగ్గు దామోదర్, మోరపల్లి రమణారెడ్డి,గోపు తిరుపతిరెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,పార్టీ నాయకులు రాఘవరెడ్డి,పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి,ప్రసాద్, ఉప్పగల్ల మల్లారెడ్డి,జనగాం రాజయ్య,ముస్కు ఉపేందర్ రెడ్డి,ముక్కిస రత్నాకర్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల,

నవంబర్ 3 : నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాలు, స్క్రీన్ షేరింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. సైబర్ ఆర్థిక నేరాల నివారణకు నవంబర్ నెల మొత్తం యువర్ మనీ, యువర్ క్లిక్, యువర్ ఛాయిస్ ప్రధాన ఇతివృత్తంతో, పాజ్ ది పేమెంట్ - వెరిఫై ది పర్సన్ నినాదంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆన్ లైన్ లో డబ్బులు చెల్లించే ముందు క్షణం ఆగి లబ్ధిదారుడి వివరాలు ధృవీకరించుకోవాలని, ఆన్ లైన్ ప్రకటనలు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, స్టాక్ మార్కెట్లో అధిక లాభాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచితుల సూచన మేరకు స్క్రీన్ షేరింగ్ యాప్ లు ఇన్ స్టాల్ చేయవద్దని, ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ కు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్.జిఓవి.ఇన్ లో ఫిర్యాదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణు, సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడు గుంత..

ప్రతి పొలానికీ కుంట



-"జలసిరి"తో ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలి -జిల్లా కలెక్టర్

చురకలు ప్రతినిధి కరీంనగర్

నవంబర్ 3 : ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలానికీ పంటకుంట తవ్వడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలని అధికారులను ఆదేశించారు.కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లిలో వివి జి రాంజీ కార్యక్రమం ద్వారా నిర్మించిన కమ్యూనిటీ వ్యవసాయ ఇంకుడు గుంతను, నాగుల మల్యాల గ్రామంలో రైతు ఎడ్ల లత పొలం వద్ద నిర్మించిన పంట కుంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదల, నీటి సంరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద గుంతల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడం ద్వారా భవిష్యత్తులో నీటి కరువు రాకుండా చూడవచ్చని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇండ్ల వద్ద ఇంకుడు గుంతలు, పంట పొలాల వద్ద పంట కుంటలు, ప్రభుత్వ భూముల్లో కమ్యూనిటీ వ్యవసాయ ఇంకుడు గుంతల నిర్మాణం శరవేగంగా సాగుతోందని తెలిపారు.వివి జి రాంజీ కార్యక్రమం ద్వారా ఈ పనులు చేపడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. జలసిరి ద్వారా నీటి వనరులు పెంపొందించేందుకు, రైతులకు మరింత మేలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఎల్ నినో నేపథ్యంలో జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జి పనులను చేపట్టామని, వీటిని నిర్మించుకునేందుకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని సూచించారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమం పై గ్రామస్తులకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో నిర్మించే కమ్యూనిటీ ఇంకుడు గుంతల్లో చేపల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తామని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

కొత్తపల్లి మండలం ఆసిఫ్ నగర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. సిబ్బంది వివరాలు, వైద్య సేవలు, మందుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు కేంద్రానికి వస్తున్న రోగుల సంఖ్య, ఆరోగ్య పరీక్షల గురించి వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ సందర్శన

కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు.పాఠశాలలో విద్యా ప్రమాణాలు, బాలికలకు కల్పిస్తున్న వసతులు, భోజన సదుపాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పక్కాభవనాలకు భూ కేటాయింపులు పూర్తి చేయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి భూ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా ఎలగందల్ మోడల్ స్కూల్, కేజీబీవీల్లో శానిటేషన్ మెరుగుపరచాలని అన్నారు. విద్యార్థుల కోసం కావలసిన అవసరాలు, సౌకర్యాలు, అవసరమైన మరమ్మతులకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఎం ఏ ఓ సంతోష్, మండల ప్రత్యేక అధికారి రణధీర్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ స్వాతి, ఇంజనీర్ స్పందన, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎంఏవో ఆనందం, ప్రిన్సిపాల్ లు రమాదేవి, కే శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్, అంజయ్య, చంద్రకళ, నిమ్మల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.